ఆగస్టు 21-సెప్టెంబర్ 4 మధ్య యూజీసీ నెట్

- జూలై 25-27 మధ్య సీఎస్ఐఆర్ నెట్

న్యూఢిల్లీ: పేపర్ లీక్ నేపథ్యంలో రద్దయిన యూజీసీ నెట్ పరీక్షకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) కొత్త తేదీలను ప్రకటించింది. ఆగస్టు 21-సెప్టెంబర్ 4 మధ్య పరీక్ష నిర్వహించనున్నట్టు శుక్రవారం ప్రకటించింది. ఈసారి ఆన్‌లైన్ మాధ్యమంలో పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపింది. వాస్తవానికి ఈ నెల 18న ఈ పరీక్ష నిర్వహించినప్పటికీ, పేపర్ లీక్ అయిందన్న ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు, సీఎస్ఐఆర్ నెట్ పరీక్షను జూలై 25-27 మధ్య నిర్వహించనున్నట్టు ఎన్టీఏ తెలిపింది. ఆలిండియా ఆయుష్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్‌ను ముందుగా నిర్ణయించిన ప్రకారం వచ్చే నెల 6నే పరీక్ష నిర్వహించనున్నట్టు వివరించింది.

పనితీరు సరిగా లేని ఉద్యోగులకు ఉద్వాసన

అన్ని శాఖలకు కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ, జూన్ 28: ఉద్యోగుల పనితీరుపై తరచుగా సమీక్ష నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని మంత్రిత్వ శాఖలకు స్పష్టం చేసింది. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, చట్టబద్ధ సంస్థలు, స్వయం ప్రతిపత్తితో కొనసాగుతున్న సంస్థల పరిధిలోని ఉద్యోగుల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా సరిగా పనిచేయని ఉద్యోగులను ముందస్తు రిటైర్మెంట్‌తో ఇండ్లకు పంపేలా చూడాలని కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ (డీవోపీటీ) అన్ని మంత్రిత్వ శాఖల కార్యదర్శులను ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగుల పనితీరును కాలానుగుణంగా సమీక్షించి వారిని ఉద్యోగాల్లో కొనసాగించాలో లేక ప్రజాప్రయోజనాల రీత్యా ముందుగానే రిటైర్మెంట్ ఇవ్వాలో నివేదించాలని పదే పదే స్పష్టం చేస్తున్నప్పటికీ పలు మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది.

శ్రీలంకలో 137 మంది భారతీయుల అరెస్ట్

కొలంబో, జూన్ 28: సైబర్ నేరాలతోపాటు అక్రమ బెట్టింగ్‌లు, జూదం నిర్వహిస్తున్న ముఠాలో భాగస్వాములుగా ఉన్నారని ఆరోపిస్తూ 137 మంది భారతీయులను శ్రీలంక సీఐడీ విభాగం గురువారం అరెస్ట్ చేసింది. కొలంబో సబర్బన్ ప్రాంతాలైన మడివెల, బట్టరముల్లతో పాటు పశ్చిమ కోస్తా పట్టణం నెగెంబోపై సీఐడీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురిని అరెస్ట్ చేయగా, అందులో 137 మంది భారతీయులు ఉన్నారు. వీరి నుంచి 135 మొబైల్ ఫోన్లు, 57 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

స్కాలర్‌షిప్ కోసం తండ్రి మరణించాడని నాటకం

అమెరికాలో భారత విద్యార్థి అరెస్ట్

పెన్సిల్వేనియా: స్కాలర్‌షిప్ కోసం బతికున్న తండ్రి చనిపోయినట్టు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి యూనివర్సిటీకి సమర్పించిన భారత్‌కు చెందిన ఒక విద్యార్థిని అమెరికా పోలీసులు అరెస్ట్ చేశారు. 19 ఏండ్ల ఆర్యన్ ఆనంద్ గత ఏడాది నకిలీ సర్టిఫికెట్లతో లేహీ వర్సిటీలో ప్రవేశం పొందాడు. స్కాలర్ షిప్ కోసం తన తండ్రి బతికి ఉన్నప్పటికీ మరణించినట్టు డెత్ సర్టిఫికెట్ సమర్పించాడు. అయితే నకిలీ సర్టిఫికెట్‌లతో అమెరికా వర్సిటీలో ఎలా సీటు తెచ్చుకుంది.. తన తండ్రి చనిపోయాడని అబద్ధం చెప్పి స్కాలర్‌షిప్ తెచ్చుకున్న వైనాలన్నీ వివరిస్తూ 'అబద్ధాలతోనే నా జీవితం, కెరీర్‌ను నిర్మించుకున్నా' పేరుతో రెడ్డిట్‌లో అతడు చేసిన పోస్టే అతడిని పట్టించింది. దీంతో ఏప్రిల్ 30న ఆనంద్‌ను అరెస్ట్ చేశారు. అతనిపై ఆరోపణలకు జీవితకాల శిక్ష పడుతుంది. అయితే అతడు నార్తంప్టన్ కౌంటీ జైలులో ఒకట్రెండు నెలలు శిక్ష అనుభవించిన తర్వాత క్షమాభిక్ష పెట్టి స్వదేశానికి పంపనున్నారు.

ఢిల్లీ ఎయిర్ పోర్టు టెర్మినల్-1లో కూలిన పైకప్పు

- క్యాబ్ డ్రైవర్ మృతి, మరో ఆరుగురికి గాయాలు
- పలు విమానాలు రద్దు.. ప్రయాణికుల అవస్థలు
- పదేండ్ల అవినీతి, నిర్లక్ష్యం వల్లే ఘటన: విపక్షాలు
- పూర్తి కాకముందే మోదీ ప్రారంభించారని ఆరోపణ
- మోదీ ప్రారంభించింది ఇది కాదు: కేంద్రమంత్రి

ఢిల్లీ విమానాశ్రయంలో టెర్మినల్-1 పైకప్పు కూలిన దృశ్యం

పైకప్పు కూలడంతో నుజ్జయిన కార్లు

న్యూఢిల్లీ, జూన్ 28: దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో టెర్మినల్-1 వద్ద పైకప్పు కుప్పకూలింది. శుక్రవారం తెల్లవారు జామున 5 - 5.30 గంటల మధ్య ఒక్కసారిగా పైకప్పు, ఇనుప పిల్లర్లు కూలిపోయాయి. దీంతో కింద ఉన్న పలు కార్లు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ఢిల్లీలోని రోహిణి ప్రాంతానికి చెందిన రమేశ్ కుమార్(45) అనే క్యాబ్ డ్రైవర్ మరణించగా, మరో ఆరుగురికి గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని సమీపంలోని దవాఖానలకు తరలించారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. ఢిల్లీ అగ్నిమాపక శాఖ, సీఐఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలికి చేరుకొని శిథిలాల కింద చిక్కుకున్న ఒకరిని రక్షించాయి. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు ఘటనా స్థలిని పరిశీలించి, పరిస్థితిని సమీక్షించారు.

పలు విమానాలు రద్దు

భారీ వర్షాల కారణంగా టెర్మినల్-1 పైకప్పు కూలిపోయిందని విమానయాన శాఖ పేర్కొన్నది. ఈ ఘటన వల్ల టెర్మినల్-1ని మూసివేస్తున్నట్టు తెలిపింది. కాగా, ఢిల్లీ ఎయిర్‌పోర్టులో మూడు టెర్మినళ్లు ఉన్నాయి. ఘటన జరిగిన టెర్మినల్-1 నుంచి ఇండిగో, స్పైస్ జెట్ సంస్థలకు చెందిన దేశీయ విమాన సర్వీసులు నడుస్తాయి. ఈ ఘటన వల్ల టెర్మినల్-1లోనికి ప్రయాణికులు రాలేకపోతున్నారని, ఈ టెర్మినల్ నుంచి బయల్దేరాల్సిన పలు విమానాలను రద్దు చేస్తున్నట్టు ఈ రెండు విమానయాన సంస్థలు ప్రకటించాయి. కాగా, ఈ ఘటనపై విచారణకు విమానాశ్రయ యాజమాన్యం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు ఐపీసీ సెక్షన్ 304ఏ, 337ల కింద కేసు నమోదు చేశారు.

మోదీ ప్రభుత్వంలో అవినీతి వల్లే: విపక్షాలు

ఢిల్లీ విమానాశ్రయ ఘటనపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. పదేండ్ల మోదీ ప్రభుత్వ హయాంలో అవినీతి, నిర్లక్ష్యం వల్ల నాసిరకం మౌలిక సదుపాయాలు పేకమేడల్లా కూలిపోతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. టెర్మినల్-1 విస్తరణ పనులు అసంపూర్తిగా ఉన్నప్పుడే ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రధాని మోదీ హడావుడిగా ప్రారంభించారని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఓమర్ అబ్దుల్లా, తృణమూల్ కాంగ్రెస్ నేత సాకేత్ గోఖలే, కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. కాగా, ప్రతిపక్షాల విమర్శలను విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఖండించారు. ప్రధాని మోదీ ప్రారంభించింది మరోవైపున ఉందని, పైకప్పు కూలింది 2009లో ప్రారంభించిన పాత భవనానికి సంబంధించినదని ఆయన పేర్కొన్నారు.

నీట మునిగిన ఢిల్లీ

- రికార్డు స్థాయిలో భారీ వర్షాలు
- 1936 తర్వాత అత్యధిక వర్షపాతం
- స్తంభించిన రాజధాని నగరం
- ఎంపీల ఇండ్లలోకి చేరిన నీరు

ఢిల్లీలోని ఓ ఏరియాలో మోకాళ్ల లోతు నీళ్లలో నడుస్తున్న ప్రజలు

న్యూఢిల్లీ, జూన్ 28: భారీ వర్షాలకు ఢిల్లీ నగరం చిగురుటాకులా వణికిపోయింది. శుక్రవారం తెల్లవారు జామున 3 గంటలకు మొదలైన వాన ఏకధాటిగా మూడు గంటలకు పైగా కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనాలు నీట మునిగాయి. అనేక ప్రాంతాల్లో ఇండ్లలోకి నీరు చేరింది. ప్రగతి మైదాన్ టన్నెల్లో భారీగా నీరు నిలిచిపోయింది. దీంతో రాజధానిలో జనజీవనం స్తంభించిపోయింది. 24 గంటల్లో ఢిల్లీలో 228.1 ఎంఎం వర్షపాతం నమోదయ్యిందని వాతావరణ శాఖ ప్రకటించింది. సాధారణంగా ఢిల్లీలో జూన్ నెల మొత్తం కలిపి సగటున 74.1 ఎంఎం వర్షపాతం నమోదవుతుంది. మూడు నెలల్లో కురవాల్సిన వర్షం కంటే ఎక్కువ కేవలం 24 గంటలల్లోనే పడింది. 1936 తర్వాత జూన్‌లో అత్యధిక వర్షపాతం నమోదయ్యింది ఇప్పుడేనని వాతావరణ శాఖ వెల్లడించింది.

ఎంపీల ఇండ్లలోకి చేరిన నీరు

భారీ వర్షాల కారణంగా ఢిల్లీలోని ఎంపీలు, మంత్రుల ఇండ్లలోకి కూడా నీరు చేరింది. లోధి ఎస్టేట్ ప్రాంతంలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్‌గోపాల్ యాదవ్ ఇంటి ముందు రోడ్డుపై మోకాళ్ల లోతు నీరు నిలవడంతో ఆయనను భుజాలపై ఎత్తుకొని కారు ఎక్కించారు. కాగా, తాను నిద్ర లేచే సరికి తన ఇంట్లోకి అడుగు ఎత్తులో నీరు చేరిందని, ఫర్నీచర్, వస్తువులన్నీ తడిచిపోయాయని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇటీవల నీటి కొరతతో నిరాహార దీక్షకు దిగిన ఢిల్లీ మంత్రి అతిశీ ఇల్లు కూడా నీట మునిగింది. అసాధారణ రీతిలో భారీ వర్షం కురవడంతో ఢిల్లీ ప్రభుత్వం అత్యవసర సమావేశం నిర్వహించింది. ఢిల్లీలో మొత్తం వర్షాకాలం కలిపి 800 ఎంఎం వర్షం పడాల్సి ఉండగా, 24 గంటల్లోనే ఇందులో 25 శాతం(228 ఎంఎం) వర్షం కురవడం వల్ల సమస్యలు తలెత్తాయని మంత్రి అతిశీ పేర్కొన్నారు.

అయోధ్య రోడ్లపై భారీగా నిలిచిన వర్షపు నీరు

ప్రచారం ఘనం.. నిర్మాణాల్లో లోపం

- బీజేపీ సర్కారు పనుల్లో నాణ్యత డొల్ల
- కుప్పకూలుతున్న ఎయిర్‌పోర్టుల పైకప్పులు
- బ్రిడ్జీలకు పగుళ్లు.. మునిగిన టన్నెళ్లు
- చిన్న వర్షాలకే అయోధ్య అతలాకుతలం

న్యూఢిల్లీ, జూన్ 28: దేశంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నామని గొప్పగా ప్రచారం చేసుకుంటున్న కేంద్రంలోని బీజేపీ సర్కారు వాటి నాణ్యతపై మాత్రం దృష్టి పెట్టడం లేదు. ఘనంగా చేస్తున్న ప్రారంభోత్సవాల హడావుడి మరవకముందే పనుల్లో డొల్లతనం బయటపడుతున్నది. ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనలు బీజేపీ హయాంలో జరుగుతున్న నిర్మాణాల్లో లోపాలను ప్రస్ఫుటం చేస్తున్నాయి.

అయోధ్య ఆలయంలో వాటర్ లీకేజీ

జనవరి 22న ప్రధాని మోదీ అట్టహాసంగా అయోధ్యలో రామమందిరాన్ని ప్రారంభించారు. చిన్నపాటి వర్షాలకే ఆలయ పైకప్పు నుంచి నీరు లీక్ అవుతున్నది. ఆలయ పరిసరాల్లోనూ సమస్యలు బయటపడ్డాయి. వర్షాలకు ఆలయ పరిసరాలు, రోడ్లు నీట మునిగి స్థానికులు, భక్తులు అవస్థలు పడుతున్నారు. ఆలయ భద్రత చూసే సైనికుల శిబిరాల్లోకి కూడా నీరు చేరింది.

అటల్ సేతుకు పగుళ్లు

మహారాష్ట్రలో సముద్రంపై నిర్మించిన ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్‌ను జనవరి 12న ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా ప్రారంభించారు. దేశంలోనే సముద్రం మీద నిర్మించిన పొడవైన ఈ వంతెనకు అటల్‌సేతు అని పేరు పెట్టారు. రూ.17,840 కోట్ల వ్యయంతో మహారాష్ట్రలోని ఎన్డీయే ప్రభుత్వం దీనిని నిర్మించింది. అయితే, ప్రారంభించి ఐదు నెలలు గడవకముందే బ్రిడ్జిపై రోడ్డుకు పగుళ్లు వచ్చాయి. కాగా, ప్రధాన బ్రిడ్జీకి పగుళ్లు రాలేదని, పక్కన సమాంతరంగా నిర్మించిన సర్వీస్ రోడ్డుపై వచ్చినట్టు మహారాష్ట్ర ప్రభుత్వం చెప్పుకున్నది.

ఎయిర్‌పోర్టుల్లో కూలిన పైకప్పులు

శుక్రవారం ఢిల్లీ ఎయిర్‌పోర్టులోని టెర్మినల్-1 వద్ద పైకప్పు కూలిపోయింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా, ఆరుగురికి గాయాలయ్యాయి. గురువారం బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఉన్న దుమ్నా ఎయిర్‌పోర్టులోనూ ఇదేరకంగా పైకప్పు కూలి పార్క్ చేసిన కారుపై పడింది.

నడుం లోతు నీటిలో ప్రగతి మైదాన్ టన్నెల్

ఢిల్లీలో రూ.777 కోట్లతో 1.3 కిలోమీటర్ల పొడవైన ప్రగతి మైదాన్ టన్నెల్‌ను నిర్మించారు. 2022 జూన్‌లో ప్రధాని మోదీ ఈ టన్నెల్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ టన్నెల్‌కు పగుళ్లు ఏర్పడ్డాయి. ఇక, శుక్రవారం కురిసిన వర్షానికి ఈ టన్నెల్ పూర్తిగా నీట మునిగింది.

బీహార్‌లో కూలిన మరో బ్రిడ్జి

ఎన్డీయే పాలిత బీహార్‌లో వరుసగా బ్రిడ్జిలు కూలుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత తొమ్మిది రోజుల్లో రాష్ట్రంలో ఐదు వంతెనలు కూలిపోయాయి. శుక్రవారం మధుబని ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న వంతెన కూలింది. గురువారం కిషన్‌బాగ్ జిల్లాలో, జూన్ 23న తూర్పు చంపారన్ జిల్లాలో, 22న సివన్‌లో, 19న అరారియాలో ఇలాగే వంతెనలు కూలిపోయాయి.

మనీలాండరింగ్‌కు ఆధారాల్లేవ్

జార్ఖండ్ మాజీ సీఎం సొరేన్‌కు హైకోర్టు బెయిల్

జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత అభివాదం చేస్తున్న హేమంత్ సొరేన్

రాంచీ: ల్యాండ్ స్కామ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్‌కు ఆ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. రూ.50 వేల బాండ్, ఇద్దరి పూచీకత్తుపై ఆయనను విడుదల చేయాలని న్యాయమూర్తి రొంగన్ గంగోపాధ్యాయ తీర్పు చెప్పారు. ఈడీ ఆరోపిస్తున్నట్టుగా ఆయన మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 31న హేమంత్ సొరేన్‌ను ఈడీ అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆయన బిర్సా ముండా జైలులో ఉన్నారు. దాదాపు 5 నెలల తర్వాత ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. దీంతో జేఎంఎం కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

అక్రమంగా అరెస్టు చేశారు..

బయటకు వచ్చిన అనంతరం సొరేన్ మాట్లాడుతూ.. 'నాపై తప్పుడు కేసు బనాయించారు. కుట్ర చేసి ఐదు నెలలు జైలులో పెట్టారు. నేను మొదలెట్టిన పనిని పూర్తిచేస్తా. యుద్ధాన్ని కొనసాగిస్తా' అని పేర్కొన్నారు.

80% మ్యాథ్స్ టీచర్లకు బేసిక్స్ తెలియవు!

తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: ఇండియా, పశ్చిమాసియాలోని దాదాపు 80 శాతం మంది మ్యాథ్స్ టీచర్లకు బేసిక్స్ కూడా తెలియవని ఓ ఎడ్‌టెక్ కంపెనీ ఈఐ నిర్వహించిన తాజా అధ్యయనంలో తేలింది. రేషియో, ప్రపోర్షనల్ రీజనింగ్, ఆల్జీబ్రా రీజనింగ్, లాజికల్ రీజనింగ్ వంటి వాటి గురించి కూడా తెలియవని అధ్యయనం తేల్చేసింది. ఇండియా, యూఏఈ, ఒమన్, సౌదీ అరేబియాలో 152 స్కూళ్లకు చెందిన 3, 4, 5, 6 తరగతులకు చెందిన 1,300 మందికిపైగా టీచర్లను రెండేండ్లపాటు అధ్యయనం చేసిన అనంతరం ఈ విషయాన్ని వెల్లడించింది. అసెస్‌మెంట్ తీసుకున్న టీచర్లలో 80 శాతం భారతీయులు కాగా, 18 శాతం మంది యూఏఈ, ఒక శాతం ఒమన్, సౌదీ అరేబియాకు చెందినవారు. 75 శాతం మంది ఉపాధ్యాయులు 50 శాతం ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పడంలో ఇబ్బంది పడ్డారు. బట్టీ చదువులకు ప్రాధాన్యమిస్తున్న మన విద్యావ్యవస్థకు ఇది ఒక కనువిప్పులాంటిదని ఈఐ సహవ్యవస్థాపకులు శ్రీధర్ రాజగోపాలన్ అన్నారు. అసెస్‌మెంట్ ర్యాంకింగ్స్‌లో భారత్ 73 దేశాలకుగానూ 72వ ర్యాంకులో నిలవడం పరిస్థితికి అద్దంపడుతున్నదన్నారు. టీచర్ల నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని అన్నారు.

కేంద్ర ప్రభుత్వ అప్పులు 172 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, జూన్ 28: కేంద్ర ప్రభుత్వ అప్పులు ఏటికేటికి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది మార్చి ఆఖరు నాటికి ప్రభుత్వ స్థూల అప్పులు రూ.171.78 లక్షల కోట్లకు చేరాయని ఆర్థిక శాఖ వెల్లడించింది. గత ఏడాది డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నాటికి రూ.166.14 లక్షల కోట్ల అప్పులు ఉండగా.. 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో(జనవరి-మార్చి) 3.4 శాతం పెరిగాయని పబ్లిక్ డెబిట్ మేనేజ్‌మెంట్ నివేదిక పేర్కొన్నది.

తొలి డిబేట్‌లో ట్రంప్‌దే పైచేయి

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడుతున్న రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమొక్రాటిక్ అభ్యర్థి జో బైడెన్ మధ్య గురువారం రాత్రి తొలి ప్రెసిడెన్షియల్ డిబేట్ జరిగింది. అట్లాంటాలోని సీఎన్ఎన్ హెడ్‌క్వార్టర్స్‌లో గురువారం రాత్రి దాదాపు 90 నిమిషాలపాటు జరిగిన ఈ చర్చలో ట్రంప్‌దే పైచేయిగా కనిపించింది. బైడెన్ తడబడుతూ మాట్లాడటంతో ఆయన పార్టీ ఆందోళనకు గురైంది. అమెరికన్ ఆర్థిక వ్యవస్థ, విదేశాలతో సంబంధాలు, వలసల గురించి బైడెన్‌పై ట్రంప్ విరుచుకుపడ్డారు. దీనిపై బైడెన్ స్పందిస్తూ, ట్రంప్ వ్యాఖ్యలు అతిశయోక్తులు, అబద్ధాలని చెప్పారు. డిబేట్‌లో బైడెన్ తేలిపోవడంతో అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలని డెమోక్రాట్ల నుంచి డిమాండ్ మొదలైంది.

నీట్‌పై అట్టుడికిన పార్లమెంట్

- పరీక్షల్లో అక్రమాలపై చర్చకు విపక్షాల పట్టు
- అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్
- సోమవారానికి వాయిదాపడ్డ ఉభయసభలు


లోక్‌సభలో ఆందోళన చేస్తున్న విపక్ష పార్టీల ఎంపీలు

న్యూఢిల్లీ: నీట్ అక్రమాలపై శుక్రవారం పార్లమెంట్ దద్దరిల్లింది. ప్రవేశ పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలపై వెంటనే ప్రభుత్వం చర్చ చేపట్టాలని లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష ఎంపీలు పట్టుబట్టారు. దీంతో ఉభయ సభలు సోమవారానికి వాయిదాపడ్డాయి. లోక్‌సభలో వాయిదా అనంతరం మధ్యాహ్నం తిరిగి సమావేశమైన తర్వాత కూడా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన కొనసాగించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం సందర్భంగా ఈ అంశంపై చర్చించవచ్చని స్పీకర్ ఓంబిర్లా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విపక్ష సభ్యులకు తెలిపారు. పార్లమెంట్‌కు కొన్ని నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉన్నదని స్పీకర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ స్పందిస్తూ విద్యార్థులకు అవేమీ తెలియదని, వారు తమకు న్యాయం చేయాలని మాత్రమే కోరుతున్నారని పేర్కొన్నారు. అటు రాజ్యసభలోనూ ఇదే సీన్ కనిపించింది. పలుమార్లు సభ వాయిదా పడింది. నీట్ అంశంపై తక్షణం చర్చకు చైర్మన్ ధన్‌ఖర్ అనుమతించకపోవడంతో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రతిపక్ష నేత ఖర్గే పోడియం వద్దకు వచ్చి ఆందోళన చేయడంపై చైర్మన్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

నీట్ రద్దుకు తమిళ నాడు అసెంబ్లీ తీర్మానం

చెన్నై: నీట్‌ను రద్దు చేయాలని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. ప్లస్ టూ పరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా మెడికల్ కోర్సుల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు అవకాశం ఇవ్వాలని కోరింది. అయితే బీజేపీ సభ్యులు ఈ తీర్మానాన్ని వ్యతిరేకించి, సభ నుంచి వాకౌట్ చేశారు. బీజేపీ మిత్ర పక్షం పీఎంకే ఈ తీర్మానానికి మద్దతునిచ్చింది.

బఫెట్ 50 వేల కోట్ల విరాళం

న్యూయార్క్:వారెన్ బఫెట్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. ఇప్పటికే వేలాది కోట్ల రూపాయలు విరాళంగా అందించిన ఆయన..తాజాగా బర్క్‌షైర్ హాథవేలో 5.3 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను పలు చారిటబుల్ ట్రస్ట్‌లకు విరాళంగా అందిస్తున్నట్లు ప్రకటించారు. 2006 నుంచి ఇప్పటి వరకు 57 బిలియన్ డాలర్ల విలువైన సంపదను ఆయన విరాళంగా అందించారు.

ఐఎస్ఎస్‌కు సమీపంలో ఉపగ్రహ శకలాలు

స్పేస్‌క్రాఫ్ట్ క్యాప్సుల్స్‌లో తలదాచుకున్న వ్యోమగాములు

న్యూఢిల్లీ, జూన్ 28: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కు మరో వ్యోమగామి విల్మోర్‌తో చేరుకున్న భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్‌తో పాటు బల్ విల్మోర్ గంటపాటు స్పేస్ క్రాఫ్ట్‌లోని క్యాప్సుల్స్‌లో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రష్యాకు చెందిన కాలం చెల్లిన ఉపగ్రహం అంతరిక్షంలో విచ్ఛిన్నమై 100కు పైగా ముక్కలు కావడంతో దాని శకలాలు అంతరిక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో సంచరించే అవకాశాలు ఉండటంతో నాసా వారిని హెచ్చరించింది. దీంతో ముందు జాగ్రత్తగా సునీతా విలియమ్స్ సహా మిగతా వ్యోమగాములు సురక్షిత ప్రాంతంలో దాక్కోవాల్సి వచ్చింది.

ఐఎస్ఎస్‌కు ఎండ్‌కార్డ్!

- 2030లో విచ్ఛిన్నం చేసేందుకు నాసా ప్రణాళిక
- కాలం చెల్లడం, సమస్యలు వస్తుండడంతో నిర్ణయం
- 'స్పేస్ఎక్స్'కు భూ వాతావరణంలోకి లాక్కొచ్చే బాధ్యత
- రూ.7 వేల కోట్లతో తయారవుతున్న డీఆర్బిట్ వెహికిల్



న్యూయార్క్, జూన్ 28: పాతికేళ్లుగా అంతరిక్షంలో వ్యోమగాములకు ఆవాసంగా ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని (ఐఎస్ఎస్) అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) విచ్ఛిన్నం చేయబోతున్నది. 2030 నాటికి ఈ పని పూర్తి చేయడానికి ఇప్పటికే ప్రణాళిక రూపొందించింది. ఇందుకు గానూ అంతరిక్ష కేంద్రాన్ని తిరిగి భూమికి తీసుకువచ్చేందుకు ఒక భారీ వ్యోమనౌక(డీఆర్బిట్ వెహికిల్)ను తయారుచేసే బాధ్యతను ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ఎక్స్‌కు అప్పగించింది. ఇప్పటికే ఇందుకోసం స్పేస్ఎక్స్‌కు నాసా రూ.7 వేల కోట్లు చెల్లించినట్టు అంతర్జాతీయ మీడియా పేర్కొన్నది. ఈ వాహనం భూఉపరితలానికి 250 మైళ్ల ఎత్తులో(దాదాపు 400 కిలోమీటర్లు) ఉన్న అంతరిక్ష కేంద్రాన్ని భూవాతావరణంలోకి లాక్కొస్తుంది. భూవాతావరణంలోకి రాగానే అధిక ఉష్ణోగ్రతల కారణంగా అంతరిక్ష కేంద్రం దహనమైపోతుంది.

ఎలా విచ్ఛిన్నం చేస్తారు ?

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని విచ్ఛిన్నం చేసేందుకు నాసా ప్రణాళిక సిద్ధమైంది. ప్రస్తుతం దాదాపు భూఉపరితలానికి 250 మైళ్ల ఎత్తులో ఉన్న అంతరిక్ష కేంద్రాన్ని 2030 మధ్యలో క్రమంగా 200 మైళ్ల ఎత్తుకు, ఆ తర్వాత 175 మైళ్ల ఎత్తుకు తీసుకువస్తారు. తర్వాత అంతరిక్ష కేంద్రం నుంచి వ్యోమగాములు అందరూ కీలకమైన సామాగ్రిని తీసుకొని భూమి మీదికి తిరిగి వచ్చేస్తారు. అప్పుడు 'స్పేస్ఎక్స్' తయారుచేస్తున్న డీఆర్బిట్ వెహికిల్ అంతరిక్ష కేంద్రాన్ని భూమికి మరింత చేరువగా లాక్కొస్తుంది. భూఉపరితలానికి 75 మైళ్ల సమీపానికి వచ్చిన తర్వాత భూవాతావరణంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా అంతరిక్ష కేంద్రం, డీఆర్బిట్ వెహికిల్ దహనం అయిపోతాయి. ఈ శకలాలు దాదాపుగా కరిగిపోతాయని, భూమి మీద పడే ముప్పు చాలా తక్కువగా ఉన్నట్టు నాసా అంచనా వేస్తున్నది. కొన్ని భాగాలు మిగిలిపోయినా సముద్రంలో పడతాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

ఎందుకు చేస్తున్నారు ?

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉపయోగించిన పరికరాలు ఇప్పుడు చాలా వరకు కాలం చెల్లిపోయాయి. భవిష్యత్తు ప్రయోగాలకు సరిపడే సౌకర్యాలు లేవు. పైగా ఇందులో నుంచి గ్యాస్, కూలెంట్ వంటివి గత కొన్నేండ్లుగా లీక్ అవుతున్నాయి. దీనికి కావాలనే చేసిన ఒక రంధ్రం కూడా ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే 2025 తర్వాత అంతరిక్ష కేంద్రం పనికిరాదనే చర్చను అంతరిక్ష శాస్త్రవేత్తలు తెరపైకి తెస్తున్నారు. దీంతో ఇక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని విచ్ఛిన్నం చేయకతప్పదని నాసా ఒక నిర్ణయానికి వచ్చింది. అయితే, దీనిని మళ్లీ భూమి మీదకు తీసుకువచ